బాలలు.. చిచ్చరపిడుగులు

- పరుగుల పోటీ నుంచి క్రికెట్ పోటీల వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- తాలూకా నుంచి రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రదర్శన
- పలువురు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక


రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి గట్కా పోటీల్లో మెడల్స్ అందుకున్న కేజీబీవీ విద్యార్థినులు వర్ష, దీపిక, మల్లిక

ఆదోని సెంట్రల్: మన ప్రభుత్వ బడులలో చదువుకునే విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. పరుగుల పోటీ నుంచి క్రికెట్ పోటీల వరకు తమ సత్తాను చాటుతున్నారు. ఆయా పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఆసక్తిని గమనించి వారికి అనుగుణంగా శిక్షణను ఇచ్చి మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి నేషనల్ లేవల్‌లో ఆడుతున్నందుకు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గట్కా ఆటలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

ఆదోని పట్టణంలోని కేజీబీవీ జనరల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వర్షతో పాటు 10వ తర గతి విద్యార్థిని మల్లిక, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని దీపిక ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో తన ప్రతిభను చాటుకున్నారు. అక్టోబర్ నెలలో రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని గట్కా అండర్–17, 19 విభాగాల్లో ప్రతిభ ను కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఢిల్లీలో నేషనల్ లెవల్‌లో జరిగే గట్కా పోటీలలో పాల్గొననున్నారు. ఇందులో దీపిక రోప్ స్కిప్పింగ్‌లోనూ తన సత్తా చాటింది. అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో అండర్–19 విభాగం 30 సెకండ్స్ ఫ్రీస్టైల్‌లో డబుల్ స్పీడ్‌లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది.

పరుగుల రాణి భవాని



కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన జి.కృష్ణ, పద్మావతిల కుమార్తె భవాని ఆదోని మండలం ఆరెకల్లు మహాత్మా గాంధీ జ్యోతిరావ్‌పూలే గురుకుల విద్యాలయంలో 10వ తరగతి చదువుతోంది.ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో తన ప్రతిభను చాటింది. అథ్లెటిక్స్ అండర్–16 జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభ కనబరిచింది. 60 మీటర్ల అథ్లెటిక్స్‌లో ప్రతిభను చాటి జాతీయ స్థాయిలో గుజరాత్ అహమ్మదాబాద్‌లో జరిగిన పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొంది.

కబడ్డీలో జాతీయ స్థాయి పోటీలకు..



ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఈరన్న, ఈరమ్మల కుమారుడు బిటి. గర్జప్ప ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. వీరు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో కబడ్డీ అండర్–17 విభాగంలో తాలూకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో మూడవ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఈ నెల మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నాడు.

రాష్ట్రస్థాయి బెస్ట్‌ప్లేయర్ అవార్డు



ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన గంగన్న కుమారుడు హనుమేష్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తర గతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కబడ్డీ ఆటలో విద్యార్థి ఆసక్తిని గమనించిన వ్యాయమ ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రోత్సహిస్తూ వచ్చాడు. కబడ్డీ పోటీల్లో గతేడాది అండర్–14 విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి, బెస్ట్ ప్లేయర్ అవార్డును కూడా అందుకున్నాడు. ఈ ఏడాది అక్టోబర్ 27 నుంచి 29 వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన అండర్–17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఖోఖోలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం



ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన గర్జన్న, సువర్ణమ్మల కుమారుడు జగదీష్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నారు. జగదీష్ ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో తాలుకా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో తన ప్రతిభను చాటాడు. ఖోఖో అండర్–16 విభాగం సబ్ జూనియర్ లెవల్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో మూడవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

జాతీయ స్థాయి పోటీలకు ఉరుకుంద విద్యార్థి


విద్యార్థితో ఉపాధ్యాయ బృందం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద జెడ్పీ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఈరన్న తెలిపారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓంకార్ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఓంకార్‌ను అభినందించారు. ఈరన్న మాట్లాడుతూ.. వచ్చే నెల ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో రాష్ట్రం తరపున ఓంకార్ ఆడుతాడని తెలిపారు.

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలో నేషనల్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన త్రోబాల్ పోటీలలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటినట్లు హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చెత్త బుట్టల పంపిణీ

కౌతాళం: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రహల్లదచారి, సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

దేవీనగర్ సమస్యలపై పరిశీలన


కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 37వ వార్డు పరిధిలోని దేవీనగర్‌లో సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కృష్ణ బుధవారం పరిశీలన చేశారు. కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి వసతి, రోడ్లు, మరుగుదొడ్లు తదితర వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న వాటర్ వర్క్స్ మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. 24వ వార్డు క్రాంతినగర్‌లో శానిటేషన్ పనులను పరిశీలించారు.

పట్టణ సీఐగా శ్రీనివాసులు



ఎమ్మిగనూరురూరల్: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ సుదర్శన్‌రెడ్డి విజయవాడకు బదిలీపై వెళ్లడంతో కర్నూలు సైబర్‌సెల్ నుంచి సీఐ వి. శ్రీనివాసులు బదిలీపై ఇక్కడికి వచ్చారు. పట్టణ ఎస్‌ఐ డాక్టర్ నాయక్, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గురజాల క్షేత్రంలో సినీ డైరెక్టర్


గురజాల రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ దర్శకుడు నాగేశ్వరరెడ్డి

నందవరం : ప్రముఖ పుణ్య క్షేత్రం, దక్షిణ కాశీగా పేరు గాంచిన గురజాల రామలింగేశ్వర స్వామిని సినీ దర్శకులు నాగేశ్వరరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి హంపేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామిరికి అభిషేక పూజలు గావించారు. అనంతరం ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి, రచయితలు భవాని ప్రసాద్, నివాస్ పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి


ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ విక్రంసింహా సూచించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో దొంగతనాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఊర్లకు, పొలం పనులకు వెళ్లినప్పుడు ఇంటికి తాళం వేశామో లేదో చూసుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లినప్పుడు దొంగతనాలు జరగకుండా అలారం క్లాక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉచితంగా అలారం క్లాక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోనెగండ్లలో రుద్రయాగం


రుద్రయాగం చేస్తున్న శివయ్యస్వామి

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో బుధవారం ఈశ్వర దేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి, వేద పండితుల ఆధ్వర్యంలో రుద్రయాగాన్ని నిర్వహించారు. స్థానిక నీలకంఠేశ్వర దేవాలయంలో రుద్రాభిషేకం నిర్వహించి పూజలు ప్రారంభించారు. అలగే మండలంలోని అలువాల, కులుమాల, హెచ్. కైరవాడి, చిన్ననేలటూర్, పెద్దనేలటూర్, గాజులదిన్నె, గంజిహళ్లి, బైలుప్పల, బి. అగ్రహారం, వేముగోడు తదితర గ్రామాల్లో కార్తీక పూజలు చేపట్టారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న బిషప్ జ్వాన్నేసు గోరంట్ల

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కర్నూలు కేథలిక్ పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జ్వాన్నేసు గోరంట్ల అన్నారు. బుధవారం సెయింట్ ఆంథోని పాఠశాలలో ముందస్తు బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్, ఆదోని విచారణ కర్తలు ఫాదర్ కోలా విజయ్‌రాజ్, పాఠశాలల హెచ్‌ఎంలు కేశవయ్య, మారెన్న, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా

ఆదోని సెంట్రల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా అన్నారు. జిల్లా 30వ మహాసభలను పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించినప్పటికీ ఏమాత్రం కరువు సహాయక చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఫీజులను రద్దు చేయక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బతుకు తెరువు కోసం వలసలు వెళ్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వసతి గృహాల్లో అరకొర వసతులతో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా ఉద్యమాలపై పలు తీర్మానాలను చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సోమన్న, ఉపాధ్యక్షులుగా రంగస్వామి, ఈరేష్, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా షాబీర్ బాషా, సహాయ కార్యదర్శులుగా శరత్ కుమార్, దస్తగిరి, థామస్‌లతో పాటు 12 మందిని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సబ్ జైలు పరిశీలన


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

ఆదోని రూరల్: పట్టణంలోని స్పెషల్ సబ్‌జైల్‌ను బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి సందర్శించారు. అక్కడ ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ మనోహర్, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ సి.ఆనంద్, జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఆదోని సెంట్రల్/టౌన్: క్షయ(టీబీ) వ్యాధి కలిగిన వారికి పోషకాహారం పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావాలని డా.షేకున్ బాను, డాక్టర్ బాల మురళీ కృష్ణ కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్ సహకారంతో క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నిరంజన్ కుమార్ 10 మంది టీబీ బాధితులను దత్తత తీసుకుని ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున వెచ్చించి ప్రతి నెలా పోషకాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బందిఉమాపతి, బాబురాజు, లలితమ్మ, స్వరూప్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను తొలగించే వరకు ఉద్యమం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థినుల కడుపులను మాడ్చిన స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి తొలగించే వరకు ఉద్యమిస్తామని పలు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్ర బాబు, నరసన్న, వీరేష్‌యాదవ్, సురేంద్రబాబు, క్రిష్ణ, అఫ్రిది, అజిత్ మాట్లాడారు. విద్యార్థుల సొమ్మును కాజేసి అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను విధుల నుండి తొలగించిన అధికారులు మళ్లీ ఆమెకు అక్కడే పోస్టింగ్ ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్, నాగరాజు, నరసింహారెడ్డి, దావీదు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: గ్రామాల్లో నెలకుని ఉన్న సమస్యల గురించి సభ్యులను సభ దృష్టికి తెస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో పరిష్కరించడానికి వీలుంటుందని ఎంపీపీ అమరేష్ అన్నారు. బుధవారం కౌతాళం మండల సర్వసభ్య సమావేశంను ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కౌతాళంలోని ఎస్సీ కాలనీలో ప్రత్యేకంగా పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించి తీర్మానం ఇవ్వాలని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ సభ దష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, లిఖీత, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, తహసీల్దారు మల్లికార్జున స్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

రైట్ కెనాల్ నిర్మించి రైతులు ఆదుకోండి

తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించి మండల రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండు చేశారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాన్ని అందజేసి, ఈవిషయంపై తీర్మానం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె నది తీరంలో తహసీల్దార్ దాడులు చేపట్టారు. రెండు ట్రాక్టర్లు, ముగతి గ్రామ సమీపంలో రెండు ట్రాక్టర్లు పట్టుకున్నారు. ట్రాక్టర్లు ఎమ్మిగనూరుకు చెందినవిగా గుర్తించారు. అనంతరం ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రికార్డులు పరిశీలించి జరిమానాలు విధిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..అక్రమంగా ఇసుకను తరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాగలదిన్నెలో ఇసుక రీచ్ లేదని, ప్రభుత్వం అనుమతులు ఇవ్వ లేదన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు, ఓవనర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఆర్ఐ జెర్మియా, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

కౌతాళం: మండల పరిధిలో బాలుడు, వృద్ధుడు అదృశ్యమైనట్లు సీఐ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. బదినేహాల్ గ్రామానికి చెందిన మాల వీరేంద్ర (17) సోమవారం బాల రంగయ్య పొలానికి మందు పిచికారీ చేయడానికని వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదని తల్లి గంగమ్మ ఫిర్యాదు చేసింది. సోమవారం ఆదోనికి వెళ్లానని చెప్పి బస్సెక్కిన హాల్వి గ్రామానికి చెందిన సిద్దన గౌడ్ (60) ఇప్పటి వరకు తిరిగి రాలేదని కొడుకు విరూపాక్షి గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బడ్జెట్‌లో ప్రజలకు అన్యాయం

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ బడ్జెట్ ప్రజలకు తీరని అన్యాయం చేకూర్చేలా ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఖాశింవలి ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. నిరుద్యోగ భృతికి నిధులు ఇవ్వలేదని, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.17వేల కోట్ల భారం మోపడం శోచనీయమన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు అరకొర నిధులు కేటాయించి ప్రజలను మభ్యపెట్టాలని చూడటం సమంజసం కాదన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మంత్రాలయం: మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మాధవరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా డయల్ 100, 112, 108, 1098, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాల, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: 104 ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని 104 ఉద్యోగులు రాజన్న, పెద్దయ్య, వీరేష్, హరి, చిట్టెమ్మ, నాగరాజు, వెంకటేష్, రాజు, వీరేష్, అయ్యప్ప డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ మొర వినిపించారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న తమ వేతనాలు సత్వరం మంజూరు చేయాలని కోరారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించి ప్రజాధనాన్ని వృథాకా నివ్వకుండా చూడాలన్నారు.

చలో కర్నూల్‌ను జయప్రదం చేయండి

కోసిగి: 18న కర్నూలులోని కోల్స్‌కాలేజీలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీస్, ఎంఎస్‌ఎఫ్ నాయకుల సమక్షంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతకుంట సామెల్, కన్వీనర్ నాగరాజు నాయకులు పాల్గొన్నారు.

పార్టీలు మారే వారికి మాట్లాడే అర్హత లేదు

ఆదోని టౌన్: పార్టీలు మారే వారికి మాట్లాడే అర్హత లేదని, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఆదోని కూటమి నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోలకల్ మునిస్వామి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో ఉంటూ పదవులను పొంది నేడు పార్టీ ఫిరాయించిన ప్రస్తుత బీజేపీ నాయకులు సజ్జ ద్, కిట్టులు స్థాయి మరిచి విమర్శిస్తున్నారన్నారు. కూటమి నేతలు కొంత మంది అధికారాన్ని అడ్డు పెట్టుకుని భూకబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీలు మారే వారికి మాట్లాడే అర్హత ఉండదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేత పదవులను పొంది నేడు ఆయననే విమర్శించడం తగదన్నారు. మాట్లాడే ముందు స్థాయి చూసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, బైచిగేరి ఎంపీటీసీ బుసిరెడ్డి పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

పెద్దకడబూరు : కందిపంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉందని, 14, 15 తేదీల్లో తపాను సూచన నేపథ్యంలో వర్షాలు వస్తే పొలంలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ఏఓ ఎం.వరప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని బాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. పొలాలకు వెళ్లి కంది పంటను పరిశీలించారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

పెద్దకడబూరు : రైతుల సమస్యలు పరిష్కరించడంలో తహసీల్దారు శ్రీనాథ్ విఫలం అయ్యారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం నాయకుడు ఆంజనేయ అన్నారు. రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దారుతో పాటు సిబ్బంది పద్ధతులను మార్చుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.